

# వాన ముసురు అందాలు



దిత్వా తుఫాన్ ప్రభావం తిరుమల క్షేత్రంలో భక్తులను వణికిస్తోంది. ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. ఎటు చూసినా గొడుగులు కనిపిస్తున్నాయి. అనేకమంది నెత్తి తడవకుండా గుడ్డలు కప్పుకొని తిరుగుతున్నారు. చలికి షెడ్ల కింద ముడుక్కుని ఉంటున్నారు. దీంతో దుకాణాలు వెలవెలపోతున్నాయి. మరోవైపున ఘాట్‌రోడ్లు సహా తిరుమల అంతా పొగమంచు కప్పేసింది. మంచు మబ్బుతెరల వెనుక దృశ్యాలు మసకబారి కనిపిస్తూ సరికొత్త అందాలను పంచుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



# తీవ్ర వాయుగుండంగా దిత్వా



- నేడు భారీ వర్ష సూచన
- తీర ప్రాంతాల్లో అధిక ప్రభావం
- అప్రమత్తమైన యంత్రాంగం
- విద్యా సంస్థలకు సెలవు
- బీచ్‌లు, జలపాతాలు, నదులవైపు రాకపోకల నిషేధం
- పీజీఆర్ఎస్ రద్దు



కోట మండలం యమదిన్నెపాలెం వద్ద అలల ఉద్రుతి



కోట మండలం శ్రీనివాససత్రం బీచ్‌లోకి సందర్శకులు వెళ్లకుండా గేటు వేసిన మెరైన్ పోలీసులు

తిరుపతి(కలెక్టరేట్)/సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఆరు గంటల్లో ఉత్తర తమిళనాడు- పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల వేగంతో ఉత్తరం వైపు కదిలిన దిత్వా.. తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆదివారం సాయంత్రానికి కడలూరుకు తూర్పున 90 కిలోమీటర్లు, కరైకల్‌కు ఈశాన్యంగా 130, పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 90, వేదరన్నియంకి ఈశాన్యంగా 180, చెన్నైకి దక్షిణ- ఆగ్నేయంగా 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఉత్తర తమిళనాడు- పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా ఉత్తరం వైపు కదిలి.. సోమవారం ఉదయానికి క్రమంగా బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో సోమవారం భారీ వర్షంతోపాటు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రధానంగా కోట, వాకాడు, చిల్లకూరు, తడ, సూళ్లూరుపేట, గూడూరు తీర ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలపై కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో సమీక్షించారు. తీర ప్రాంతాలతో పాటు జిల్లాలోని లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించారు. అవసరాన్ని బట్టి పునరావాస కేంద్రాలకు నిరాశ్రయులను తరలించేలా ప్రణాళికలు రూపొందించారు. తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ 0877-2236007 నెంబర్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, అధికారుల సెలవులు రద్దుచేసి విధుల్లో చేరి 24 గంటలు అందుబాటులో ఉండాలను కలెక్టర్ ఆదేశించారు. ముందుజాగ్రత్త చర్యగా సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అలాగే, కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండలస్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇక, కోట, వాకాడు, చిల్లకూరు వద్ద సముద్ర అలలు ఎగసి పడుతున్నాయి. సూళ్లూరుపేటలో పులికాట్ సరస్సు సుముద్రాన్ని తలపించేలా నీటి అలలు ఉద్రుతంగా ఉన్నాయి. జిల్లాలోని జలపాతాలు, నదులు, బీచ్‌ల వద్దకు సందర్శకులు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. వాగులు, చెరువులను అధికారులు ఆదివారం పరిశీలించారు.

### వర్షపాతం ఇలా..

ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు నమోదైన వర్షపాతం.. వెంకటగిరిలో 25.2 మి.మీ., చిట్టమూరు 25, పెళ్లకూరు 23.6, తొట్టంబేడు 22.4, దొరవారిసత్రం 20.6, వాకాడు 20 మి.మీ. చొప్పున నమోదైంది. దాదాపు 17 మండలాల్లో వర్షపాతమే నమోదు కాలేదు.

## 'అల'కల్లోలం

కోట, ఆంధ్రజ్యోతి: కోట మండలంలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల్లో సముద్రం 'అల'కల్లోలంగా మారింది. శ్రీనివాసత్రం వద్ద భారీ అలలతో 30 అడుగుల ముందుకు సముద్రం వచ్చినట్లు మెరైన్, కోట పోలీసులు తెలిపారు. రెండో రోజూ మత్స్యకారులు సముద్రంలోకి చేపలవేటకు వెళ్లకుండా తమ బోట్లను ఒడ్డునే ఉంచారు. అలలు ముందుకు వచ్చితాకడంతో బోట్లు ఎక్కడ సముద్రంలోకి కొట్టుకుపోతాయోనని మత్స్యకారులు ఆందోళన చెందారు. శ్రీనివాసస్రతం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం వద్ద సముద్ర తీరానికి సందర్శకులు వెళ్లకుండా మెరైన్ పోలీసులు ఆంక్షలు విధించారు.

## విమానాలు ఆలస్యం

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: తుపాను కారణంగా ఆదివారం పలు విమానాలు ఆలస్యంగా వచ్చాయి. రేణిగుంట విమానాశ్రయానికి నిత్యం 16 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఆదివారం ఉదయం 7.15కు హైదరాబాద్ నుంచి రావాల్సిన ఎయిర్ అలయన్స్ విమానం 8.25కు చేరుకుంది. మధ్యాహ్నం 12.35కు రావాల్సిన ఇండిగో ఎయిర్ బస్ 25 నిమిషాలు.. సాయంత్రం 5.20కు ముంబై నుంచి రావాల్సిన ఇండిగో విమానం 6.20కి.. అలాగే పలు విమానాలు 10 నుంచి 15 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నాయి.

## బీ అలర్ట్

### తుఫాను నేపథ్యంలో ఎస్పీ సుడిగాలి పర్యటన



అరణియార్ ప్రాజెక్టు వద్ద ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: తుఫాను నేపథ్యంలో ఎక్కడెక్కడ నదులు, వాగులు, చెరువులు, కాలువలు, డ్యామ్‌లు నిండి ఉద్రుతంగా ప్రవహించే అవకాశాలు ఉన్నాయనేది అధ్యయనం చేయడానికి ఎస్పీ సుబ్బరాయుడు ఆదివారం సంబంధిత డీఎస్పీలతో కలిసి పర్యటించారు. పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టును డీఎస్పీ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిండిందని, మళ్లీ వర్షం కురిస్తే గేట్లు ఎత్తడం వల్ల గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందా అని తెలుసుకున్నారు. దీనిపై ముందుగానే ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అరణియార్ నుంచి 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఈఈ తెలిపారు. ప్రతి ప్రాజెక్టు వద్ద రెస్క్యూ టీమ్‌లను సిద్ధంగా ఉంచారు. గతంలో తిరుపతి రూరల్ మండల పరిధిలోని స్వర్ణముఖినదిలో సరదాగా ఈతకని వెళ్లి నలుగురు యువకులు చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో వాగులు, నదుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. బాగా తెలిసిన దారే కదా అని కదా ప్రవాహం వున్న ప్రదేశాల్లో వాహనాలు నడపడం.. దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు కంట్రోలు రూము నెంబరు 80999 99977, ఎమర్జెన్సీ నెంబరు 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

**జిల్లాలో మూడు రెస్క్యూ టీమ్‌లు** : తిరుపతిలో మూడు రెస్క్యూ టీమ్‌లను ఎస్పీ సుబ్బరాయుడు సిద్ధం చేశారు. వీరితో పాటు ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక టీమ్ అందుబాటులో ఉంది. వీరికి అవసరమైన లైటింగ్ సామగ్రి, లైఫ్ జాకెట్లు, టార్చ్ లైట్లు, తాళ్ళు తదితర రక్షణ పరికరాలు అందించారు. నీట మునిగే అవకాశం ఉన్న రహదారుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

## డిస్కం ఉద్యోగులూ.. సిద్ధంగా ఉండండి

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: 'దిత్వా తుఫాన్ ప్రభావంతో వీచే గాలులకు విద్యుత్ వైర్లు తెగొచ్చు. స్తంభాలు కూలిపోవచ్చు. తద్వారా సరఫరాలో అంతరాయం కలగొచ్చు. వెంటనే వీటన్నింటినీ సరిచేసి సరఫరా పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండండి' అంటూ సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే టోల్ ఫ్రీ నెంబరు 1912, లేదా 1800 425 155333కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని వినియోగదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## జలకళలాడుతున్న తిరుమల డ్యామ్‌లు



పాపవినాశనం డ్యామ్

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను వానలతో తిరుమలలోని జలాశయాలు పొంగి పొర్లుతున్నాయి. అక్టోబరులో కురిసిన వర్షాలకే తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యాములు 98 శాతం నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లను కూడా అప్పుడు ఎత్తాల్సివచ్చింది. నిజానికి ఇప్పుడు భారీ వర్షాలు కురవకపోయినా, నవంబరు నెల ప్రారంభంలో కురిసిన వర్షాలకు శేషాచల అడవుల నుంచి ఊటనీరు భారీగా డ్యాముల్లోకి చేరుతూ వచ్చింది. నవంబరు24వ తేదీకే డ్యాములన్నీ నిండిపోయి, గోగర్భం, పాపవినాశనం డ్యాముల గేట్లు ఒక అంగుళం మేర తెరిచి దిగువకు వదులుతున్నారు. రెండురోజుల నుంచి కురుస్తున్న వానలతో డ్యాములు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ముందుజాగ్రత్తగా ఆదివారం మధ్యాహ్నం గోగర్భం, పాపవినాశనం గేట్లు మరొక అంగుళం పైకెత్తారు. ప్రస్తుతం పాపవినాశనంలో 5,240 లక్షల గ్యాలన్లు, గోగర్భంలో 2,833 లక్షల గ్యాలన్లు, ఆకాశగంగలో 685 లక్షల గ్యాలన్లు, కుమారధారలో 4,258.98 లక్షల గ్యాలన్లు, పసుపుధార డ్యాములో 1,287.51 లక్షల గ్యాలన్ల నీరు ఉంది. దాదాపు తొమ్మిది నెలల పాటు తిరుమల నీటి అవసరాలు తీర్చేంత నీరు ప్రస్తుతం డ్యాముల్లో ఉంది.

## నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వినియోగదారులు 89777 16661 నెంబరుకు ఫోనుచేసి సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 91333 31912 నెంబరుకూ చాట్‌చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లచ్చన్నారు.


## పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను నేపథ్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పోలీసు పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు సుబ్బరాయుడు తెలిపారు. ఎవరూ ఎస్పీ కార్యాలయానికి రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీసు స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## శ్రీహరి డాలర్లు 'నో స్టాక్'

తిరుమలలో శ్రీవారి బంగారు డాలర్ల కొరత ఏర్పడింది. వారం రోజులుగా డాలర్లు లేకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా టీటీడీ బంగారు, వెండి, రాగి డాలర్లను విక్రయిస్తోంది. శ్రీవారి సన్నిధిలో స్వామి, అమ్మవార్లు ఉండే బంగారు, వెండి, రాగి డాలర్లను కొనుగోలు చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ప్రతి నెలా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల విక్రయాలు జరుగుతుంటాయి. వారం రోజుల కిందట 2 గ్రాములు, 5 గ్రాములు, 10 గ్రాముల బంగారు డాలర్ల కొరత ఏర్పడింది. సాధారణంగా స్టాక్ పూర్తయ్యేలోపే డాలర్లను కౌంటర్లకు తీసుకొచ్చి భక్తులకు అందుబాటులో ఉంచాలి. వారం కిందటే బంగారు డాలర్లు ఖాళీ అయినా, తెప్పించలేదు. ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు 'డాలర్ల విక్రయ కేంద్రం' వద్దకు వెళితే 'నోస్టాక్' బోర్డు కనిపిస్తోంది. స్టాక్ ఎప్పుడు వస్తుందో కూడా చెప్పలేని పరిస్థితిలో సిబ్బంది ఉన్నారు. మరోవైపు రాగి డాలర్ల విక్రయాలు దాదాపు ఏడాదిగా నిలిచిపోయాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి బంగారు డాలర్లు(ఫైల్)

## హైదరాబాదుకు సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్ర చేపట్టిన మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరాం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతపై అవగాహన పెంపొందించడమే ధ్యేయంగా ఆదివారం శ్రీకాళహస్తి నుంచి హైదరాబాద్‌కు సైకిల్‌యాత్ర మొదలైంది. మిస్ యూనివర్స్ ఏపీ, ప్రముఖ మోడల్ చందన జయరామ్ ఈ సైకిల్ యాత్ర చేపట్టారు. అంతకుముందు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. మహిళలు మరింత శక్తిమంతంగా ఎదగాలని చందన జయరామ్ పిలుపునిచ్చారు. అనంతరం 600 కిలోమీటర్ల సైకిల్‌యాత్రను ప్రారంభించారు.

## మీ ఖాతాలో డబ్బు పోయిందా?

- తక్షణం 1930కి ఫోన్ చేయండి
- లేకుంటే మీ డబ్బు వెనక్కి రానట్లే

సాంకేతికత పెరుగుతున్న కొద్దీ వివిధ రకాల సైబర్ మోసాలు అధికమవుతున్నాయి. ప్రధానంగా బ్యాంకు ఖాతాల నవీకరణ, ఉద్యోగం పొందారని.. పొందుతున్నారంటూ, వివిధ పార్సిళ్ల మీ పేరిట బుక్ అయ్యాయంటూ ఓటీపీ చెప్పాలంటారు. అలా ఓటీపీ చెప్పగానే మీ ఖాతాల నుంచి నగదు ఖాళీ అవుతుంది. ఇక తెలియని మొబైల్ నెంబర్ల నుంచి సెల్‌ఫోన్లకు వస్తున్న కొన్ని మెసేజీలను ఓపెన్ చేసినా.. ఒక్కోసారి అకౌంట్లలోని డబ్బులు గల్లంతవుతున్నాయి. ఇలా కొట్టేసిన నగదును నేరగాళ్లు వెనువెంటనే మ్యూల్ ఖాతాలకు పంపేస్తున్నారు. ఒకసారి మ్యూల్ ఖాతాలకు వెళితే వెనక్కి తెచ్చుకోవడం కష్టం. దీనిని అడ్డుకుని డబ్బు వెనక్కి రావాలంటే.. నగదు డ్రా అయినట్లు మెసేజ్ రాగానే బాధితులు తక్షణం 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఎంత త్వరగా పోలీసులకు వివరాలు వెల్లడిస్తే అంత త్వరగా పోయిన డబ్బును వెనక్కు రప్పించవచ్చని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. అలా కొందరికి వచ్చిన సొమ్మును కొంత కాలంగా అందిస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో జరిగిన సైబర్ నేరాల్లో 25 శాతం మంది బాధితులకు పోగొట్టుకున్న నగదు వెనక్కి తెప్పించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు 517 మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. వీరిలో దాదాపు 120 మంది బాధితులకు మాత్రమే ఊరట లభించింది. బాధితులు అప్రమత్తంగా

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

## తిరుమలేశుడి సేవలో సుజయనిధితీర్థ



తిరుమల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ముల్బాగల్‌లోని శ్రీపాదరాజమఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామిజీ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్ద స్వామిజీకి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చక బృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు.

రాత్రి 11 దాకా

## వరాహస్వామి దర్శనం కల్పించాలి




రఘు



అంబికా కృష్ణ

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వరాహస్వామి దర్శనాన్ని రాత్రి 11 గంటల వరకు కల్పించాలని సినీ నిర్మాత అంబిక కృష్ణ కోరారు. ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. పురాణాల ప్రకారం ముందుగా వరాహస్వామిని దర్శించుకుని ఆ తర్వాత శ్రీవారిని దర్శించుకోవాలని ఉందని, ఈ సంప్రదాయాన్ని పాటించేవారి సంఖ్య పెరిగిందన్నారు. అయితే ప్రస్తుతం రాత్రి 9 గంటలకే వరాహస్వామి దర్శనాన్ని నిలిపివేస్తుండడం భక్తులకు ఇబ్బందిగా మారిందన్నారు. పండితులతో చర్చించి రాత్రి 11 గంటలకు వరకు వరాహస్వామి దర్శన భాగ్యాన్ని కల్పించాలని టీటీడీని కోరుకుంటున్నానన్నారు. కాగా ఆదివారం సినీనటుడు రఘు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

## సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు**

**శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,791**

**తలనీలాలు సమర్పించినవారు: 28,911**



## శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్ రవి



తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## కర్ణాటక సంగీతంలో యామినీకృష్ణకు డాక్టరేట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీతంలో చేసిన పరిశోధనకు కరి యామినీకృష్ణకు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. 'శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ సంగీత రచనలు-విశ్లేషణ' అనే అంశంపై ఆచార్య శైలేశ్వరి పర్యవేక్షణలో ఆమె పరిశోధనా వ్యాసం సమర్పించారు. సింహాచలం సుప్రభాత రచయిత అయిన నారాయణాచార్య భాగవతార్ సంపూర్ణ సంగీత కృషిని ఈ పరిశోధన ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్జీయూకేటీలో సంగీత అధ్యాపకురాలిగా యామినీకృష్ణ పనిచేస్తున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసమంగాపురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మోహన్ సోదరుడు అంతరాజి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరుపతిలోని అస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్య బృందంతో శ్రీనివాసమంగాపురం గ్రామస్థులకు, పరిసర ప్రాంత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

## విదేశాల్లో ఉద్యోగాలిప్పిస్తా

● ప్రైవేటు వైద్యుడి మోసం.. చీటింగ్ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వచ్చేవారికి మాయమాటలు చెప్పేవాడు. విదేశాల్లో తనకు తెలిసిన వాళ్లున్నారని.. ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించేవాడు. ఇలా మోసం చేసిన ప్రైవేటు వైద్యుడిపై బాధితుల ఫిర్యాదుతో ఆదివారం చీటింగ్ కేసు నమోదైంది. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. గతంలో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో డాక్టర్ రమేష్ పనిచేసే వాడు. తిరుపతికి చెందిన కోమల వైద్యం కోసం ఆ ఆస్పత్రికి వచ్చారు. ఈ క్రమంలో ఆమె కుమారుడు భార్గవరాజుకు సింగపూర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని డాక్టర్ రమేష్ చెప్పాడు. దీనికి కొంత ఖర్చవుతుందంటూ ఆమెను నమ్మించి.. రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో.. డబ్బు ఇవ్వాలంటూ ఆమె పలుమార్లు అతడిని కలిసి అడిగారు. చివరకు అతడు తిరుపతి నుంచి వెళ్లిపోవడంతో ఆమె ఈస్ట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



మాడవీధుల్లో ఊరేగుతున్న సుందరరాజస్వామి

తిరుచానూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవర్లకు అభిషేకం చేశారు. సర్వాలంకార శోభితులైన స్వామివారు ఉభయదేవేరులతో కలిసి తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

# చంద్రగిరి









చంద్రగిరి గంగమ్మ ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ - దిగువ వీధికి చెందిన యువత ఏర్పాటు చేసిన బెలూన్

## రేపటి నుంచి గంగ జాతర

● చంద్రగిరిలో విస్తృత ఏర్పాట్లు

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణం పాతపేటలోని దిగువవీధి, ఆకుతోటవీధి, కొత్తపేటలోని జమండ్లవీధి, దాసరివీధిలలో గంగమ్మ జాతరను మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నారు. 2022 తర్వాత నిర్వహిస్తుండటంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ పినపెద్దలు పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరుపాక్షి శంకర్‌రెడ్డి, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, నామాల శ్రీనివాసులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు బలులు, ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. సోమవారం గంగమ్మ ప్రతిమలను తయారు చేయడానికి స్వర్ణముఖి నదిలో సుమారు 15 అడుగుల మేర గోతిని తవ్వనున్నారు. చంద్రగిరిలో మూడు రోజుల ముందునుంచే జాతర వాతావరణం నెలకొంది. దిగువ వీధికి చెందిన యువకులు జాతర శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన పెద్ద బెలూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### భారీ భద్రత

గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రగిరి సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. వంద మంది పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ట్రాఫిక్ మళ్లించామని, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## పల్లెల్లో స్వచ్ఛత-శుభ్రతకు పెద్దపీట

● తనపల్లెలో జోరుగా పారిశుధ్య పనులు



తనపల్లె వీధుల్లో చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతిరూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్యాన్ని గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర పేరిట చెత్త, చెదారాల తొలగింపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటి వద్దే తడి, పొడిచెత్తను వేరుచేసి ఇచ్చేలా పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించి, ప్రజలను చైతన్యపరుస్తున్నారు. సరికొత్తగా బిన్ అండ్ బ్యాగ్ విధానాన్ని అమలు చేసి.. బిన్‌లో తడిచెత్త, బ్యాగ్‌లో ప్లాస్టిక్, గాజు బాటిళ్లు, విద్యుత్ వ్యర్థాలు వంటి ఘన వ్యర్థాలను వేయడంపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. స్వచ్ఛరథం పేరిట గ్రామాల్లో పొడిచెత్తను సేకరించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించి ప్రోత్సహిస్తున్నారు. గ్రీన్ అంబాసిడర్లకు క్లిష్టతతో కూడిన తడి, పొడిచెత్తలు వేరుచేయడం సులభతరం కావడంతోపాటు వారికి పని భారం కూడా తగ్గుతోంది. అలాగే ఇంటింటికీ తిరిగి ట్రైసైకిళ్ల ద్వారా తడి, పొడిచెత్తని సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి చెత్తనుంచి సంపదని సృష్టించి పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుతున్నారు. మండల పరిధిలో పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులను కేటాయించారు. ప్రతి మండలంలో ఒక పంచాయతీని ఎంపిక చేసి సుస్థిర అభివృద్ధి ప్రణాళికల లక్ష్యాల(సస్టైనబుల్ గోల్స్)ని సాధించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో భాగంగా వారం రోజుల కిందట తిరుపతిరూరల్ మండలంలో తనపల్లె పంచాయతీని ఎంపిక చేసుకుని ఐదవ థీమ్‌లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛత-శుభ్రతకు పెద్దపీట వేసేవిధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ నేతృత్వంలో మండలంలోని 32పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్ల భాగస్వామ్యంతో గ్రామంలోని ఆరు హ్యాబిటేషన్ల పరిధిలో చెత్త, చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. ఇంటింటికీ తిరిగి బిన్ అండ్ బ్యాగ్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో పలుచోట్ల పడేసిన చెత్తను సేకరించి తరలించారు. కాలువలో వ్యర్థాలను తొలగించారు. ఇళ్లమధ్యలో పేడదిబ్బలు వేసిన వారికి నోటీసులు అందించారు. గ్రామాన్ని ఇదేవిధంగా మెయిన్‌టైన్ చేసుకోవాలని కార్యదర్శికి సూచించారు.

## టీడీపీ నేతకు నివాళి



→ వాసుదేవనాయుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాని

చంద్రగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యగారిపల్లెకు చెందిన టీడీపీ నేత ఏనుగల వాసుదేవనాయుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి ఆ గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా పాల్గొన్నారు.



పిళ్లారికోన చెరువును పరిశీలిస్తున్న ఏఈ యతిరాజులు

## ఆర్సీపురంలో మోస్తరు వర్షం

రామచంద్రాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా మండలంలో రెండు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. శనివారం మధ్యాహ్నం మొదలైన వాన ఆదివారం రాత్రి వరకు పలు దఫాలుగా కురిసింది. ఆదివారం వ్యవసాయ పనులు పూర్తిగా ఆగిపోగా, కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇరిగేషన్ ఏఈ యతిరాజులు చెరువులను పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. పలు దఫాలుగా విద్యుత్ సరఫరా ఆగిపోవవంతో అధికారులు పునరుద్ధరించారు.

## ఒకే పోస్టులో ఇద్దరు సూపరింటెండెంట్లు

● పద్మావతీ అమ్మవారి ఆలయంలో గందరగోళం

తిరుచానూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో కుర్చీ కోసం ఇద్దరు సూపరింటెండెంట్లు కుస్తీపడుతున్నారు. టీటీడీ అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అమ్మవారి ఆలయంలో ఏడాదిగా సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల బ్రహ్మోత్సవాలకు డిప్యూటేషన్ మీద సురేష్‌బాబును నియమించారు. బ్రహ్మోత్సవాలు ముగిసినా ఆలయంలోనే డిప్యూటేషన్ మీద కొనసాగాలని టీటీడీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే సమయంలో మునిచెంగల్రాయులును సూపరింటెండెంట్‌గా నియమించారు. రెండు షిఫ్టులలో సూపరింటెండెంట్లు విధులు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం సురేష్‌బాబు, మునిచెంగల్రాయులు ఇద్దరు ఒకేసారి డ్యూటీలో కొనసాగారు. దీంతో ఎవరి మాట వినాలో తెలియక ఉద్యోగులు తలలు పట్టుకున్నారు. ప్రోటోకాల్ విషయంలో కాస్త గందరగోళం ఏర్పడింది. ఇప్పటికే ఆలయ పరిపాలన కార్యాలయానికి శ్రీవాణి సూపరింటెండెంట్‌గా కొనసాగుతుండగా టెంపుల్ సూపరింటెండెంట్‌గా రమేష్ ఉన్నారు. మరో పోస్టుకు ఇద్దరిని నియమించడంతో ఈ సమస్య వచ్చింది. టీటీడీ అధికారులు స్పందించి వివాదానికి తెరదించాల్సి ఉంది.

## మహిళ ఆత్మహత్య



సమీర మృతదేహం

పాకాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణయ్యగారిపల్లె రోనఖ్ నగర్‌లో ఒక మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రోనఖ్ నగర్‌కు చెందిన సాహుల్‌కు రేణిగుంట మండలం గురవరాజువారిపల్లెకు చెందిన సమీరా(19)తో ఇటీవల వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొన్ని రోజులుగా గొడవపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో సమీరా ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఒంటరి ఏనుగు బీభత్సం

● కమ్మపల్లె పంచాయతీలోని పంటలపై దాడి

● చెట్లను విరిచేసి.. ఓ కోళ్లఫారాన్నీ ధ్వంసం చేసింది





ఒంటరి ఏనుగు విరిచేసిన కొబ్బరి, మామిడి చెట్లు

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై ఒంటరి ఏనుగు దాడులు ఆగడంలేదు. కమ్మపల్లె పంచాయతీలో శనివారం రాత్రి బీభత్సం సృష్టించింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయల్దేరిన ఒంటరి ఏనుగు బాలిరెడ్డిగారిపల్లె వద్దకు చేరుకుంది. నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డికి చెందిన కొబ్బరి, మామిడిచెట్లను విరిచేసింది. ముల్లంగి, బెండ, ఆలసంద పంటలను నాశనం చేసింది. దేశిరెడ్డిగారిపల్లెలోని గరుడారెడ్డి, తిమ్మారెడ్డికి చెందిన టేకు, ఎర్రచందనం చెట్లను కూకటివేళ్లతో పెకలించింది. ఇదే గ్రామంలోని శిద్దారెడ్డి, రవీంద్రారెడ్డి, కేశవులురెడ్డికి చెందిన మామిడి, కొబ్బరిచెట్లను విరిచేసి, పశుగ్రాసాన్ని తినేసింది. అక్కడినుంచి కమ్మపల్లె వద్దకు చేరుకుంది. గ్రామానికి సమీపంలో ఉన్న విశ్వనాథనాయుడికి చెందిన కోళ్లఫారాన్ని ధ్వంసం చేసింది. పక్కనున్న సుధాకర్‌నాయుడు, శిద్దయ్యనాయుడికి చెందిన కొబ్బరి, మామిడిచెట్లను విరిచేసి, పశుగ్రాసాన్ని తినేసింది. ఈ క్రమంలో ఒంటరి ఏనుగు చేసిన ఘీంకారంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడినుంచి వచ్చిన మార్గంలోనే అడవిలోకి వెళుతూ పలువురు రైతులకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది.



కదల్లేని స్థితిలో ఉన్న ఏనుగు



కుంకీల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది



పొక్లెయిన్ సాయంతో ఏనుగును బయటకు తీస్తున్న అధికారులు



ఏనుగును చూడటానికి వచ్చిన జనం

## ఆపరేషన్ గజ

కాలు విరిగి చెరువులో ఇరుక్కుపోయిన ఏనుగు

కాపాడే ప్రయత్నంలో అటవీశాఖ

యాదమరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలు విరిగి చెరువులో కదల్లేని స్థితిలో ఉండిపోయిన ఒక ఏనుగును కాపాడేందుకు అటవీశాఖ ప్రయత్నిస్తోంది. వారం కిందట తమిళనాడు రాష్ట్రం నుంచి యాదమరి మండలంలోని కమ్మపల్లె అటవీ బీట్‌లోకి ఒంటరి ఏనుగు ప్రవేశించింది. అడవిలో జారిపడటంతో ఏనుగు కుడికాలు తొడభాగంలో ఎముక విరిగింది. అయినా కష్టంమీద తిరుగాడిన ఏనుగు శనివారం రాత్రి యాదమరి మండలం డీకే చెరువు సమీపంలోని గుడ్డివాని చెరువులోకి దిగింది. ఆ తర్వాత కదలేక నీటిలోనే ఉండిపోయింది. ఆదివారం స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి పరిశీలించి ఏనుగును కాపాడేందుకు చర్యలు మొదలుపెట్టారు. పలమనేరు ముసలిమడుగు నుంచి కృష్ణ, అభిమన్యు అనే కుంకీ ఏనుగులను, మావటీలను రప్పించి మధ్యాహ్నం నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్వీ జూపార్కు వైద్యులు డాక్టర్ అరుణ్, డాక్టర్ తోయిబా సింగ్ పర్యవేక్షణలో ముందుగా ఏనుగుకు నొప్పి నివారణ మందులు ఇస్తామని అటవీ అధికారులు తెలిపారు. అనంతరం మత్తు ఇంజక్షన్ ఇచ్చి పొక్లెయిన్ సాయంతో లారీలోకి ఎక్కించి తిరుపతి ఎస్వీ జూపార్కుకు తరలించనున్నామని అనంతపురం సర్కిల్ సీసీఎఫ్ యశోదాబాయి తెలిపారు. కాగా ఈ ప్రక్రియను చూసేందుకు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. అటవీ సిబ్బందికి ఇబ్బంది తలెత్తకుండా ఎస్ఐ ఈశ్వర్ చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి పది గంటలైనా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అటు తమిళనాడు అటవీశాఖ అధికారులు కూడా ఈ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మరోవైపు మండల సరిహద్దుల్లో బోడబండ్ల బీట్‌లో 13 ఏనుగుల గుంపు తిష్ఠ వేసి ఉన్నట్లు సమాచారం. దీంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో శ్రీనివాసులు హెచ్చరించారు.

## ఘనంగా సత్యసాయి జయంతి



సత్యసాయికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీలో ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి వీసీ కృష్ణమూర్తి పుష్పాంజలి ఘటించి, నివాళి అర్పించారు. యూనివర్సిటీలోని కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. మొక్కలు నాటి, పరిశుభ్రత చర్యలు చేపట్టారు. సేవకు, ప్రేమకు సత్యసాయి ప్రతిరూపంగా నిలిచారని వీసీ కొనియాడారు. అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనవరి 6న దశ సహస్ర సువాసినీ పూజ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్ ఆచార్య తదితరులు

తిరుపతి(జీవకోన), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశక్తిపీఠం రమ్యానంద భారతి 40 జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 6న దశ సహస్ర సువాసినీ పూజ నిర్వహించనున్నట్లు మేనేజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ ఆచార్య తెలిపారు. ఆదివారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ పదివేల మంది సువాసినులకు ప్రత్యక్ష పూజ నిర్వహించనున్నామని చెప్పారు. మహిళల సంరక్షణ కోసం శక్తిపీఠం వద్ద (రాయలచెరువు, తిరుపతి) ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 7737928773, 9160455255లను సంప్రదించాలని కోరారు.

## మలబార్‌లో ఈబీజే ప్రదర్శన



ఈబీజే ప్రదర్శనను ప్రారంభిస్తున్న కస్టమర్లు

తిరుపతి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఆదివారం ఎక్స్‌క్లూజివ్ బ్రాండెడ్ జ్యువెలరీస్ ప్రదర్శన ప్రారంభించారు. బంగారం, వజ్రాలు, అన్‌కట్ వజ్రాలు, జాతిరత్నాలతో కూడిన అరుదైన ఆభరణాలను ఒకేచోట అందుబాటులో ఉంచామని షోరూం హెడ్ రిజీష్ తెలిపారు. ప్రతి కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని, వజ్రాభరణాల విలువపై 30శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు. వందశాతం పాత బంగారం మార్పిడికి అవకాశముందని తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 5న తిరుమల మహాపాదయాత్ర



పోస్టరును ఆవిష్కరిస్తున్న పాదయాత్ర నిర్వాహకులు

తిరుపతి(జీవకోన), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, జడ్పీ మాజీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన తిరుమల మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి శంకరయ్య తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య నడిచిన కాలిబాటను అభివృద్ధి చేయాలన్న ప్రధాన ఉద్దేశంతో అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 22 సంవత్సరాలుగా మహాపాదయాత్ర నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరి చెంగయ్య, ప్రతాప్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గురజాడకు ఘన నివాళి



తిరుపతి(కల్చరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, నాటక రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఘన నివాళి అర్పించారు. స్థానిక కోదండ రామాలయ మాడవీధిలోని చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సభ్యులు సీఆర్‌కే శేషగిరిరావు, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు హనుమంతరావు, రాయలసీమ రంగస్థలి కళాకారుల సంఘం అధ్యక్షుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుగుణమ్మకు సన్మానం



తిరుపతి(కల్చరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మను న్యూ సమైక్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఆదివారం సన్మానించారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆమెను సన్మానించి, తమ సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని కూడా వారు సన్మానించారు.

## భగవద్గీత కంఠస్థ పోటీల వాయిదా

తిరుపతి(కల్చరల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నమాచార్య కళా మందిరంలో ఆదివారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరగాల్సిన భగవద్గీత కంఠస్థ పోటీలను వాయిదా వేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, మళ్లీ ఈ పోటీల నిర్వహణ తేదీని ప్రకటిస్తామని తెలిపింది.

## వేడుకగా గీతా జయంతి

తిరుపతి(కల్చరల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్రనామ, భగవద్గీత పారా యణం చేశారు. లక్ష్మీస్తోత్రం పఠిస్తూ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పద్మావతి డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథ్‌రెడ్డి, బ్రాహ్మణ సేవా సంఘం తిరుపతి నగర కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యురాలు భాగవతుల జయలక్ష్మి పాల్గొన్నారు.

## న్యూమంగళం పంచాయతీకి చేరిన నూతన ట్రాలీ



తిరుపతి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన న్యూమంగళం పంచాయతీకి నూతన ట్రాలీ అందింది. ఇదివరకు కొత్త ట్రాక్టర్(ఇంజన్) ఇచ్చినా ట్రాలీ పాతబడిపోవడంతో చెత్త తరలించడంలో సమస్యలు ఎదురయ్యేవి. ఈ క్రమంలో కొత్త ట్రాలీకోసం ప్రతిపాదనలు పంపగా మంజూరైంది.

## తుప్పుపడుతున్న బస్సు మెటీరియల్



తిరుపతి డిపో గ్యారేజీలో పాడవుతున్న బస్సు సీట్ల ఫ్రేమ్స్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీలో బస్సు సీట్లను అమర్చే ఇనుప ఫ్రేమ్స్ తుప్పుపడుతున్నాయి. ఇటీవల వాటిని తయారు చేసి, రంగులు వేసి గ్యారేజీ ఆవరణలో ఓ మూల ఉంచారు. బస్సులకు అమర్చే పనులు వాయిదా పడుతుండటంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడై పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

## మద్యం మత్తులో దాడి మేస్త్రికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణపడ్డారు. ఇందులో ఒకరు గాయపడ్డారు. ఆదివారం తిరుపతిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... ఒడిశాకు చెందిన దివాకర్ దాస్, అతని స్నేహితుడు సుభాష్ తిరుపతి సుభాష్‌నగర్‌లో ఉంటున్నారు. మేస్త్రిలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన దివాకర్ దాస్ తన వద్ద ఉన్న బాటిల్‌తో సుభాష్‌పై దాడి చేశాడు. అతనికి బలమైన గాయాల య్యాయి. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

## దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

- నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 18న జరిగిన దారి దోపిడీ ఘటనలో నలుగురు నిందితులను అలిపిరి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు... రేణిగుంట మండలం తారకరామానగర్‌కు చెందిన భూఖే మహేష్, జయలక్ష్మణ్ కుమార్, కరకంబాడికి చెందిన జాఫర్, కడప జిల్లా రామాంజనేయపురానికి చెందిన పోకిలి ప్రభుదాస్ రేణిగుంట, తిరుపతి కేంద్రాలుగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 18న ఉపాధ్యాయనగర్ వద్ద ఆటో కోసం వేచి ఉన్న నెల్లూరుకు చెందిన శ్రీధర్‌ను మాటల్లో దింపి బంగారు చైను లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లోకేష్‌బాబు కేసు నమోదు చేశారు. ఆదివారం తిరుపతిలో నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు చందు, వివేక్ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

చిన్నపిల్లల హృదయాలయలో

# అధ్వానంగా పారిశుధ్యం



ఆస్పత్రి పరిసరాల్లో పేరుకుపోయిన బయో వ్యర్థాలు, చెత్త - ఆస్పత్రి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

తిరుపతి(వైద్యం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలకు గుండె వైద్యసేవలు అందించేందుకు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రి పరిసరాల్లో ఎటుచూసినా పారిశుధ్య లోపం కనిపిస్తోంది. జబ్బుతో బాధపడే చిన్నారులు చికిత్స పొందే పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఆస్పత్రి చుట్టు బయో వ్యర్థాలను పడేశారు. ఆస్పత్రిలో డ్రైనేజీ కాలువలు నిండి ఆ మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. దీంతో చిన్నారులు, వారి సహాయకులు దుర్వాసన భరించలేక ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా చిన్నారులు మరింత వ్యాధుల బారినపడే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 15, 16 తేదీల్లో ఛలో ఢిల్లీ



సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్‌యాదవ్

తిరుపతి(జీవకోన), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15, 16 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వరప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 15న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా, 16న ఏపీ భవన్‌లో జాతీయ సెమినార్ ఉంటాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పార్లమెంటు సమావేశాలలో బిల్లు ఆమోదం కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉమాబాయ్, విజయ్, వెంకట్‌యాదవ్, సునీల్, గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

## నేడు ఇన్‌ఛార్జి మంత్రి అనగాని రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 10.15 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11.40గంటలకు జీవకోనలో స్థానిక నేతలతో కలిసి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆటోనగర్‌లోని టీడీపీ తిరుపతి పార్లమెంటరీ కార్యాలయానికి చేరుకుని పార్టీ నేతలతో సమావేశమవుతారు. సాయంత్రం 6గంటలకు తిరుమలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని అక్కడే బస చేస్తారు. మంగళవారం ఉదయం 10.45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని డీఆర్‌సీ మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం 6.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి విజయవాడకు వెళతారు.

## లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస సేవలు విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక యూత్ హాస్టల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస జోనల్ అడ్వైజరీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి క్లబ్ సామాజిక కార్యక్రమాలను పెంచాలన్నారు. రక్తదానం, కంటి చూపు, విద్యారంగానికి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి నిర్ణయించామన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 317ఇ తిరుపతి జిల్లా సభ్యులు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.భాస్కర్, చిట్టిబాబురెడ్డి, రాజేంద్ర ప్రసాద్, సోమయ్య, శాంతినాదార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాభి అసత్య ప్రచారాలు మానుకోవాలి

### టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్



తిరుపతి(జీవకోన), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి చోరీ కేసులో టీడీపీ నేత పట్టాభి అసత్య ప్రచారాలు మానుకోవాలని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 2023 జూన్ 19న బోర్డు మీటింగ్‌లో ఎస్టేట్ కమిటీ మెంబర్‌గా పోకల అశోక్‌కుమార్‌ను నియమించుకుని పరకామణిలో దోచుకోవడానికి కుట్ర జరిగిందని పట్టాభి ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. ఆయనకు అవగాహన లేకుండా అవాస్తవాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎస్టేట్ కమిటీ అంటే సబ్ కమిటీ మాత్రమేనని, దానికి తీర్మానం చేసే అధికారం ఉండదని తెలిపారు. వాస్తవాలు తెలుసుకుని, తప్పు జరిగితే బాధ్యులను శిక్షించాలన్నారు. రెండేళ్ల తాను బోర్డు మెంబర్‌గా ఉన్నానని ఏ తప్పూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కల్లూరి చెంగయ్య, సురేష్ పాల్గొన్నారు.

## ఐఐటీలో భారత్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్



ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లె సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో భారత్ లీన్ కన్‌స్ట్రక్షన్ ఎక్సలెన్సీ ఇనిస్టిట్యూట్(ఐఎల్‌సీఈ) ఆధ్వర్యంలో నిర్వహించే 8వ ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్ ఆదివారం ప్రారంభమైంది. ఈనెల 3వ తేదీ వరకు జరిగే ఈ సదస్సు వర్క్‌షాప్‌తో ప్రారంభమైంది. అకడమిక్ పాట్రన్‌గా ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ వ్యవహరిస్తుండగా ఇండస్ట్రీ ప్యాట్రన్‌గా గోద్రెజ్ కన్‌స్ట్రక్షన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనూప్ మాథ్యూ హాజరవుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న నిర్మాణ పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, కన్సల్టెంట్లు, ఇండస్ట్రీ భాగస్వాములు పాల్గొంటున్నారు. సస్టైనబుల్, డిజిటల్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు డెలివరీపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. సోమవారం ఇండస్ట్రీ డే నిర్వహించనున్నారు. 2, 3 తేదీల్లో ప్రధాన కాన్ఫరెన్స్ జరుగుతుంది. దేశ నిర్మాణ రంగాన్ని మరింత సమర్థవంతంగా మార్చేందుకు లీన్ కన్‌స్ట్రక్షన్ పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది.

**నేడు మంత్రి నారాయణ రాక**

రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ సోమవారం ఈ సదస్సుకు హాజరుకానున్నారు. సోమ, మంగళవారాల్లో జరిగే 8వ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు.

## 14 నుంచి తిరుపతి ఐఐటీలో స్పోర్ట్స్ మీట్

ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ(ఐఐటీ)ల 58వ ఇంటర్‌స్పోర్ట్స్ మీట్ ఈ నెల 14 నుంచి 9 రోజుల పాటు తిరుపతి ఐఐటీ వేదికగా జరగనుంది. సాంకేతిక పరిశోధనల దిశగా నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులకు మానసికోల్లాసం కలిగించేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. తిరుపతి ఐఐటీతో పాటు మద్రాస్, హైదరాబాద్ ఐఐటీ వేదికలుగా ఈ క్రీడా పోటీలు జరుగుతాయి. తిరుపతి ఐఐటీలో పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ భారతీయ రెజ్లర్ సతీష్ శివలింగం హాజరుకానున్నారు. దేశంలోని 23 ఐఐటీల నుంచి 5వేలమందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అధికారులూ అప్రమత్తంగా ఉండండి



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో నగరంలోని లక్ష్మీపురం సర్కిల్, డీఆర్ మహల్ రోడ్డు, లెప్రసీ కాలనీతో పాటు పలు ప్రాంతాలను ఆదివారం ఆమె పరిశీలించారు. కాలువల్లో చెత్తవేయడం వల్ల వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ప్లాస్టిక్, కూరగాయల వ్యర్థాలు, థర్మాకోల్ షీట్లు వంటివి వేయడం వలన నీరు ఆగిపోతున్నాయని తెలిపారు. వర్షాలు ఎక్కువగా ఉన్న తరుణంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. వర్షంలో ఇబ్బందులు కలిగిన వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పురాతన భవనాలు, చెట్ల కింద నివాసం ఉండొద్దని ప్రజలను కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సాయం కోసం కంట్రోల్ రూమ్ (0877-2256766, 9000822909) సంప్రదించాలని సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్‌లు తులసీ కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు వెంకట ప్రసాద్, రాజు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, సుమతి ఉన్నారు.

## రేపటి సూరీడు కోసం...

ఫుట్‌పాత్‌లపై చలికి వణుకుతున్న అభాగ్యులు



తిరుపతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చలికి జిల్లా వణుకుతోంది. తిరుపతిలో చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కాలుబయట పెట్టాలంటే వెచ్చని స్వెటర్లో, రెయిన్ కోటో తగిలించాల్సిందే. కానీ కొందరు అభాగ్యులు తిరుపతి రుయా ఆస్పత్రి, అలిపిరి సమీపంలోని ఫుట్‌పాత్‌పై చలికివణుకుతూ దయనీయ స్థితిలో ఉన్నారు. నేటి చలిని కాపాడుకుంటూ రేపటి సూర్యుడు వస్తాడని వేచి చూస్తున్నారు. ప్రభుత్వం నైట్ షెల్టర్లు పెట్టింది కానీ ప్రచారం చేయకపోవడంతో వాటి గురించి చాలామందికి తెలియదు.

# విపత్తు వేళా.. విధుల్లో ఉండరే!

## దామానెల్లూరు సచివాలయంలో కానరాని సిబ్బంది



దామానెల్లూరు సచివాలయంలో ఎంపీడీవో మురళీకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ విజయరాఘవులు, హెడ్ కానిస్టేబుల్ జార్జ్, ఏఎన్ఎం బేబీ సురేఖ

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉద్యోగులు, అధికారులు సెలవులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. అయితే మండల పరిధిలోని దామానెల్లూరు సచివాలయం ఆదివారం తెరుచుకోలేదు. సిబ్బంది ఒక్కరు కూడా విధుల్లో లేరు. ఎంపీడీవో మురళీకృష్ణ ఆ గ్రామ పరిశీలనకు వెళ్లగా ఈ విషయం బయటపడింది. విపత్తు సమయంలో సచివాలయ సిబ్బంది జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ విధి నిర్వహణకు డుమ్మా కొట్టడం గమనార్హం. ఎంపీడీవో వెంట సింగిల్ విండో డైరెక్టర్ విజయరాఘవులు, హెడ్ కానిస్టేబుల్ జార్జ్, ఏఎన్ఎం బేబీ సురేఖ ఉన్నారు.

## సెల్‌ఫోన్ హ్యాక్ చేసి రూ.12.05 లక్షల తస్కరణ

డక్కిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలోని నగదు మాయం చేశారు. పోలీసుల కథనం మేరకు... డక్కిలి మండలం దిగువ లింగసముద్రం గ్రామానికి చెందిన భార్గవ నెల్లూరులోని ఓ బ్యాంకు నుంచి రూ.13,59 లక్షలు రుణం పొందారు. ఈ మొత్తాన్ని ఖాతాలోనే ఉంచారు. భార్గవ సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి అతని బ్యాంకు ఖాతా నుంచి చేసి తొమ్మిది దఫాలుగా రూ.12.05 లక్షలు దోచేశారు. ఖాతాలో నగదు మాయమైనట్లు గుర్తించిన బాధితుడు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శివశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో తుపాన్ ప్రభావంపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే రెండు రోజులు తుపాన్ ప్రభావంతో సూళ్లూరుపేట డివిజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ముఖ్యంగా నదులు, వాగులు, వంకలు ప్రవహించే ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకూడదన్నారు. పులికాట్‌లో సరస్సులో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. సూళ్లూరుపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, అధికారులు, సిబ్బందితో కలిసి పల్లపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

## అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన ఓజిలిలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో నారాయణరెడ్డి, పలు శాఖల అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు ఉన్నారు.

**పెళ్లకూరు:** వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు హరికృష్ణ ఆదేశించారు. మరో 24 గంటల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, మురుగునీటి కాలువల్లో నీరు నిల్వ చేరకుండా చూడాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులకు సూచించారు.

## ఎడతెరపిలేని ముసురు

పెళ్లకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలంలో శనివారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయత్రం వరకు 23.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో జనజీవనం స్థంభించింది. గ్రామీణ రహదారులు ఛిద్రమయ్యాయి. వర్షాలతో పంటలు పచ్చదనం పరుచుకుని ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

**దొరవారిసత్రం:** దిత్వా తుపాన్ ప్రభావంతో దొరవారిసత్రం మండలంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం నెలకొంది. సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. తహసీల్దారు శైలాకుమారి ఇతర అధికారులతో కలిసి తోట్టు ప్రాంతాలను, తనియాలి వద్ద కాళంగిపై వంతెన పరిశీలించారు.

## టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త శంకరమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అశోక్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. శ్రీధర్‌రెడ్డిని పార్టీ నాయకులు అభినందించారు.

## బీచ్‌ల్లోకి నో ఎంట్రీ

కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని శ్రీనివాస సత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల సమీపంలోని బీచ్‌ల్లోకి సందర్శకులు వెళ్లకుండా మెరైన్ పోలీసులు ఆంక్షలు విధించారు. మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐ శివసౌమ్య, కోట ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో బీచ్‌ల్లోకి వెళ్లే దారులను మూసివేశారు.

# గూడూరును తిరుపతితో కలిపిన పాపం వైసీపీదే

## ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్




టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలో కలిపిన పాపం వైసీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపిందని గుర్తుచేశారు. ఇప్పుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేలా చొక్కాలు పట్టుకుని నిలదీయాలని అంటున్నారని, అప్పుడే ఆ పని ఎందుకు చేయలేదని సునీల్‌కుమార్ ప్రశ్నించారు. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తూ ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని చెప్తే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అరాచక పాలన సాగించినందుకే ఎన్నికల్లో వైసీపీ ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని తాను రెండుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. మరోమారు ప్రజల ఆకాంక్షను ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు తన పోరాటాన్ని ఆపబోనని, అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, శివకోటారెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, మట్టం శ్రావణి, జలీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరును నెల్లూరులో కలిపే వరకు పోరాటం



రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకులు

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, లేనిపక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక షాదీ మంజిల్‌లో వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో యువగళం పాదయాత్రలో నారా లోకేశ్, మహిళా సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ మేరకు మాట నిలబెట్టుకోవాలని కోరారు. గూడూరు జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వానికి తమ ఆకాంక్షను తెలియజేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దశరథరామిరెడ్డి, మునిగిరీష్, జమాలుల్లా, వేగూరు రాజేంద్రప్రసాద్, శివకుమార్, చంద్రనీల్, నాగేశ్వరరావు, శశికుమార్, ప్రభాకర్, సునీల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ చూడొద్దంటూ మందలించారని

# ఉరేసుకొని బాలిక ఆత్మహత్య



మృతి చెందిన చిత్ర

తడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం సెల్‌ఫోన్ చూడటం మాని చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఇంటర్మీడియట్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తడ మండల పరిధిలోని కారూరు గ్రామానికి చెందిన సూళా కుమార్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు కుమారుడు నవీన్‌రాజు, కుమార్తె చిత్ర(16) ఉన్నారు. చిత్ర తమిళనాడు ఆరంబాకంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం 6 గంటల సమయంలో నిద్రలేచిన వెంటనే సెల్‌ఫోన్ చూస్తుండడంతో తండ్రి కుమార్ మందలించాడు. పొద్దున్నే సెల్‌ఫోన్ చూడకుండా చదువుకోవాలని చెప్పి పనికి వెళ్లిపోయాడు. కుమారుడు నవీన్‌రాజు బయటకు వెళ్లగా, తల్లి పక్కవీధిలో ఉన్న దుకాణంలో సరుకులు కొనుక్కోవడానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చిత్ర చీరతో ఉరివేసుకుంది. కొంతసేపటి తరువాత వచ్చిన నవీన్‌రాజు ఇంటికి గెడియపెట్టి ఉండటంతో కిటికిలో నుంచి చూశాడు. ఉరివేసుకొని ఉన్న చెల్లిని చూసి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లారు. కొన ఊపిరితో ఉన్న చిత్రను శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం చెన్నైకు తీసుకెళ్లగా చిత్ర మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లాడ్జిలో అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



మృతి చెందిన మహిళ

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కచ్చేరి వీధిలోని రైల్వేగేటు సమీ పంలో ఉన్న ఓ లాడ్జిలో అనుమా నాస్పదస్థితిలో మహిళ మృతి చెం దింది. శనివారం రాత్రి తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఓ మహిళతో కలిసి సూళ్లూ రుపేట కచ్చేరివీధిలోని ఓ లాడ్జికి వచ్చారు. 101 నెంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. ఆదివారం ఉదయం మహిళ బెడ్‌పై మృతి చెంది ఉండడాన్ని లాడ్జి సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు అక్కడకు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. గదిలో, పరిసరాల్లో మృతురాలికి సంబంధించి ఆధా రాలు ఏవీ లభించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా జీఎన్‌టీ రోడ్డులోని వైన్‌షాపులో సుబ్రహ్మణ్యం మద్యం సీసా తీసుకుని లాడ్జికి చేరుకున్నారు. అతని వెంట మృతి చెందిన మహిళా కూడా ఉన్నట్లు గుర్తించారు. మృతు రాలు ఎరుపురంగు చీర, పసుపు రంగు జాకెట్ ధరించిన ఉంది. వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. మొబైల్ ఫోన్ ఆధా రంగా తమిళనాడులోని పొన్నేరి ప్రాంతానికి చెందిన వారుగా భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయస్థాయి జూడో పోటీలకు అంధుల జట్టు ఎంపిక




తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొన్న అంధులు

డక్కిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఈనెల 19నుంచి 23వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అంధుల జూడో పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి జూడో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పాళ్ల శేషగిరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వాసుదేవరావు, కార్యనిర్వాహక సభ్యుడు రంగినేని రాజా పాల్గొన్నారు.

## ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా విభజన జరగాలి

గూడూరు అర్బన్/డక్కిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలు, డివిజన్ల విభజన ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా జరగాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డివిజన్ల విభజనలో శాస్త్రీయ దృక్పధం లోపించిందన్నారు. భౌగోళికల పరిస్థితులు, ప్రజల మనోభావాలను పక్కనపెట్టి రాజకీయ కారణాలతో విభజించడం వల్ల ప్రజల్లో అసంతృప్తి, ఆందోళన నెలకొంటాయన్నారు. గూడూరు నియోజకవర్గంతో పాటు, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను నెల్లూరు జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు.

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



మెట్లపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

నాయుడుపేట టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకుడు కనమర్లపూడి సుబ్రమణి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజోత్సవం నిర్వహించారు. పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలోని కనమర్లపూడి నివాసం వద్ద అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సురేంద్ర, తంగరాజు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## 15, 16 తేదీల్లో ఛలో ఢిల్లీ

తిరుపతి(జీవకోన), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15, 16 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వరప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 15న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా, 16న ఏపీ భవన్‌లో జాతీయ సెమినార్ ఉంటాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అక్షయ సేవా సమితి సభ్యులు

వాకాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడివాక గ్రామంలో పేద వృద్ధులకు షిరిడీ సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో చిల్లకూరు సాయిరెడ్డి దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అల్లం రమణయ్య, కోటిరెడ్డి, బాబురావు, బాబురెడ్డి, అల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గోవిందపల్లిపాళెంలో అంబళం పూజ

కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లి పాళెం మత్స్యకార గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి అంబళపూజ జరిగింది. స్థానిక రామాలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామికి పడి, మెట్ల పూజ చేశారు. కర్పూర హారతులు ఇచ్చారు. అయ్యప్ప భజనలు చేశారు. అయ్యప్పస్వామి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు.



అంబళంపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

## కాళంగి నది పరిశీలన



కాళంగి నదిని పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్

సూళ్లూరుపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య కాళంగి నది, నెర్రికాలువ, పాముల కాలువను పరిశీలించారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం ఇలుపూరు - మంగళంపాడు గ్రామాల మధ్య ఉన్న దొండ కాలువను పరిశీలించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురిసే అవకావం ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ అవసరమొచ్చినా కాంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని కోరారు. సీఐ మురళీకృష్ణ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, కుమార్, కరిముల్లా, పెంచలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కదల్లేని స్థితిలో ఉన్న ఏనుగు



కుంకీల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది



పొక్లెయిన్ సాయంతో ఏనుగును బయటకు తీస్తున్న అధికారులు



ఏనుగును చూడటానికి వచ్చిన జనం

# ఆపరేషన్ గజ

## కాలు విరిగి చెరువులో ఇరుక్కుపోయిన ఏనుగు

### కాపాడే ప్రయత్నంలో అటవీశాఖ

యాదమరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలు విరిగి చెరువులో కదల్లేని స్థితిలో ఉండిపోయిన ఒక ఏనుగును కాపాడేందుకు అటవీశాఖ ప్రయత్నిస్తోంది. వారం కిందట తమిళనాడు రాష్ట్రం నుంచి యాదమరి మండలంలోని కమ్మపల్లె అటవీ బీట్‌లోకి ఒంటరి ఏనుగు ప్రవేశించింది. అడవిలో జారిపడటంతో ఏనుగు కుడికాలు తొడభాగంలో ఎముక విరిగింది. అయినా కష్టంమీద తిరుగాడిన ఏనుగు శనివారం రాత్రి యాదమరి మండలం డీకే చెరువు సమీపంలోని గుడివాని చెరువులోకి దిగింది. ఆ తర్వాత కదల్లేక నీటిలోనే ఉండిపోయింది. ఆదివారం స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి పరిశీలించి ఏనుగును కాపాడేందుకు చర్యలు మొదలుపెట్టారు. పలమనేరు ముసలిమడుగు నుంచి కృష్ణ, అభిమన్యు అనే కుంకీ ఏనుగులను, మావటీలను రప్పించి మధ్యాహ్నం నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్వీ జూపార్కు వైద్యులు డాక్టర్ అరుణ్, డాక్టర్ తోయిబా సింగ్ పర్యవేక్షణలో ముందుగా ఏనుగుకు నొప్పి నివారణ మందులు ఇస్తామని అటవీ అధికారులు తెలిపారు. అనంతరం మత్తు ఇంజక్షన్ ఇచ్చి పొక్లెయిన్ సాయంతో లారీలోకి ఎక్కించి తిరుపతి ఎస్వీ జూ పార్కుకు తరలించనున్నామని అనంతపురం సర్కిల్ సీసీఎఫ్ యశోదాబాయి తెలిపారు. కాగా ఈ ప్రక్రియను చూసేందుకు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. అటవీ సిబ్బందికి ఇబ్బంది తలెత్తకుండా ఎస్ఐ ఈశ్వర్ చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి పది గంటలైనా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అటు తమిళనాడు అటవీశాఖ అధికారులు కూడా ఈ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మరోవైపు మండల సరిహద్దుల్లో బోడబండ్ల బీట్‌లో 13 ఏనుగుల గుంపు తిష్ట వేసి ఉన్నట్లు సమాచారం. దీంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో శ్రీనివాసులు హెచ్చరించారు.

## తూర్పున మోస్తరు వర్షం



శ్రీకాళహస్తి పట్టణంలోని కార్గిల్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

శ్రీకాళహస్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షపు జల్లులు కురిశాయి. దిత్వా తుఫాన్ ప్రభావంతో ముసురు వాతావరణం కొనసాగింది. అయితే తేలికపాటి జల్లులు విడిచివిడిచి కొనసాగాయి. అధికార యంత్రాంగం వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించింది.

**సత్యవేడు (ఆంధ్రజ్యోతి):** దిత్వా తుఫాన్ ఎఫెక్ట్‌తో వాతావరణం ఒక్కసారిగా మారి పోయింది. తుఫాను ప్రభావంతో సత్యవేడు నియోజకవర్గంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి ఈదురు గాలులు వీస్తున్నాయి. చలిగాలులకు వృద్ధులు, పిల్లలు ఇళ్ళకే పరిమితమయ్యారు. తుఫాను ప్రభావానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసింది. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. నియోజకవర్గంలోని అరణియార్, కాళంగి ప్రాజెక్టుల వద్ద అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని కైలాసకోన, ఉబ్బలమడుగు, ఆరే జలపాతాల వద్ద పర్యాటకుల నిషేధించారు.

## 14నుంచి తిరుపతి ఐఐటీలో స్పోర్ట్స్ మీట్

### తొమ్మిదిరోజుల పాటు ఆటలు ● 23 ఐఐటీల విద్యార్థుల ప్రాతినిధ్యం

ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ(ఐఐటీ) 58వ ఇంటర్‌స్పోర్ట్స్ మీట్ ఈనెల 14 నుంచి 9 రోజుల పాటు తిరుపతి ఐఐటీ వేదికగా జరగనుంది. సాంకేతిక పరిశోధనల దిశగా నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ మేధోమ దనం చేస్తున్న విద్యార్థులకు మానసికోల్లాసం కలిగించేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. తిరుపతి ఐఐటీలో జరిగే ఈ వేడుకల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ భారతీయ రెజ్లర్ సతీష్ శివలింగం హాజరు కానున్నారు. దేశంలోని 23 ఐఐటీల నుంచి 5 వేల మందికి పైగా విద్యార్థులు తిరుపతి, మద్రాస్, హైదరాబాద్ ఐఐటీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. తిరుపతి ఐఐటీలో చెస్(మిక్సడ్), టెన్నిస్(పురుషులు, మహిళలు), వెయిట్ లిఫ్టింగ్(పురుషులు) పోటీలు జరగనున్నాయి.

## ఉపాధ్యాయుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



సమావేశమైన ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డీఎస్సీ 2000 ఉపాధ్యాయులు ఆదివారం పట్టణంలోని బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరి నొకరు ఆత్మీయంగా పలకరించుకుని వారి అనుభవాలను పంచుకున్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులు జీతభత్యాలు ఆన్‌లైన్ ద్వారా వ్యక్తిగత ఖాతాలో జమ చేసే విధానం తీసుకురా వడం, నాలుగు ఏళ్ల అప్రెంటిస్ షిప్‌పై పోరాటాల ద్వారా రెండేళ్లకు తగ్గించుకోవడంపై విజయవంతం అయ్యామన్నారు. అదే విధంగా అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయించడంలో కీలక పాత్ర పోషించి నేటి ఉపాధ్యాయ తరానికి మార్గదర్శకులు కావడంతో డీఎస్సీ 2000 తరం కీలక పాత్ర పోషించిందన్నారు. అన్ని వృత్తులలోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని తెలపారు.

## విరిగిపడ్డ చెట్టు కొమ్మలు

### ముక్కంటి ఆలయ పార్కింగ్‌లో దెబ్బతిన్న రెండు కార్లు



శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహానంది సమీపంలో ఉన్న చెట్టు కొమ్మలు ఆదివారం రాత్రి గాలి ధాటికి విరిగి పడ్డాయి. దీంతో ప్రహరీకి అవతలివైపు పార్కింగ్‌లో ఉన్న రెండు కార్ల ముంగు భాగం దెబ్బతిన్నాయి. పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు భద్రత కల్పించకుండా నిర్లక్ష్యం వహించడంపై భక్తులు ప్రశ్నిస్తున్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని అరవకొత్తూరుకు చెందిన మునికుమార్(30) అనే ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో ఆదివారం ఇంటి వద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రుయాకు రెఫర్ చేశారు.

## కర్ణాటక సంగీతంలో యామినీకృష్ణకు డాక్టరేట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీతంలో చేసిన పరిశోధనకు కరి యామినీకృష్ణకు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. 'శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ సంగీత రచనలు-విశ్లేషణ' అనే అంశంపై ఆచార్య శైలేశ్వరి పర్యవేక్షణలో ఆమె పరిశోధనా వ్యాసం సమర్పించారు. సింహాచలం సుప్రభాత రచయిత అయిన నారాయణాచార్య భాగవతార్ సంపూర్ణ సంగీత కృషిని ఈ పరిశోధన ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్జీయూకేటీలో సంగీత అధ్యాపకురాలిగా యామినీకృష్ణ పనిచేస్తున్నారు.

# పుత్తూరు వార్తలు

## పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునస్వామి

పుత్తూరు అర్బన్, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఆదివారం మధ్యాహ్నం పిచ్చికుక్కదాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఓ ప్రైవేటు స్కూలు వాచ్‌మగా ఉన్న మునస్వామితో పాటు కొరియర్ బాయ్ ఆకాష్, మరో వ్యక్తి ఉన్నారు. దీనిపై కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆ పిచ్చికుక్కను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వ్యక్తులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తం

● పిల్లారిపట్టు, ఉప్పు కాలువల పరిశీలన



పిల్లారిపట్టు కాలువలో వ్యర్థాల తొలగింపు

పుత్తూరు అర్బన్, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను నేపథ్యంలో పుత్తూరు పట్టణంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టారు. ఆదివారం పిల్లారిపట్టు, ఉప్పు కాలువలను ఏఈ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణతో కలిసి కమిషనర్ నాగేశ్వరరావు పరిశీలించారు. తుఫాను ప్రభావంతో వర్షం కురిస్తే చేపట్టాల్సిన చర్యలను సిబ్బందికి సూచించారు. ఈ కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తే రాకపోకలు సాగకుండా బారీకేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కాలువల్లో ఇరువైపుల ఉన్న వ్యర్థాలను తొలగింపజేశారు. భవానీ నగర్, పిల్లారిపట్టు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను ప్రభావంతో ఇబ్బందులు తలెత్తితే నెం.7075067503కు ఫోన్ చేయాలని కోరారు.

## మాదకద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు

పుత్తూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల సేవన, రవాణా చట్ట రీత్యా నేరమని, యువత వాటికి దూరంగా ఉండాలని లేకపోతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ అంజాద్ బాషా హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సి.టి.ఆర్ నెత్తంలో జరుగుతున్న శిబిరంలో ఆయన ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసులు, బాబురావు, నాగరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

## నిలకడగా కాళంగి జలాశయం

కేవీబీపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న కాళంగి జలాశయం ప్రస్తుతానికి నిలకడగా ఉన్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ నబియా చెప్పారు. ప్రస్తుతం 217.3 అడుగుల నీరు ఉందన్నారు. జలాశయం నీటి మట్టం పెరిగిన వెంటనే గేట్లు ఎత్తడానికి సిబ్బందిని ఇక్కడే ఉంచినట్లు తెలిపారు.

## ఐఐటీలో భారత్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్

### 3వ తేదీ వరకు నిర్వహణ ● నేటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి నారాయణ




ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లె సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో భారత్ లీన్ కన్‌స్ట్రక్షన్ ఎక్సలెన్సీ ఇనిస్టిట్యూట్(ఐఎల్‌సీఈ) ఆధ్వర్యంలో నిర్వహించే 8వ ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్ - ఐఎల్‌సీసీ 2025 ఆదివారం నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు జరగనుంది. ఈ కాన్ఫరెన్స్ ఆదివారం వర్క్‌షాప్‌తో ప్రారంభమైంది. కాన్ఫరెన్స్‌కు అకడమిక్ ప్యాట్రన్‌గా తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ వ్యవహరిస్తుండగా ఇండస్ట్రీ ప్యాట్రన్‌గా గోద్రెజ్ కన్‌స్ట్రక్షన్ సీనియన్ వైస్ ప్రెసిడెంట్ అనూప్ మాథ్యూ హాజరవుతున్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న నిర్మాణ పరిశ్రమ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, కన్సల్టెంట్లు, ఇండస్ట్రీ భాగస్వాములు పాల్గొంటున్నారు. సస్టైనబుల్, డిజిటల్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు డెలివరీపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. డిసెంబరు 1న సోమవారం ఇండస్ట్రీ డే నిర్వహించనున్నారు. 2, 3 తేదీల్లో ప్రధాన కాన్ఫరెన్స్ జరుగుతుంది. దేశ నిర్మాణ రంగాన్ని మరింత సమర్థవంతంగా మార్చేందుకు లీన్ కన్‌స్ట్రక్షన్ పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించనుంది.

### ప్రధాన అంశాలు

కాంట్రాక్టు అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ సపోర్ట్ ఫర్ లీన్ కన్‌స్ట్రక్షన్(బీఐఎం ఇంటిగ్రేషన్), ప్రొడక్షన్, ప్లానింగ్ అండ్ కంట్రోల్, హెల్త్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, లీన్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, లీన్ పీపుల్, కల్చర్ అండ్ చేంజ్, లీన్ అండ్ గ్రీన్‌కన్‌స్ట్రక్షన్, మాడ్యులర్ అండ్ ఆఫ్ -సైట్ కన్‌స్ట్రక్షన్ అంశాలపై ప్రముఖులు చర్చించనున్నారు.

### హాజరయ్యే ప్రముఖులు

- ప్రొఫెసర్ సురేష్ జైన్, హెచ్‌ఓడీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ఐఐటీ తిరుపతి - కాన్ఫరెన్సు చైర్
- ప్రొఫెసర్ కోషీ వర్గీస్, డైరెక్టర్ ఐఎల్‌సీఈ అండ్ ప్రొఫెసర్ ఐఐటీ మద్రాస్
- డాక్టర్ ప్రసన్న కుమార్ బెహేరా, ఐఐటీ తిరుపతి, లోక్ కమిటీ చైర్
- డాక్టర్ ఏవీ రాహుల్, లోకల్ కమిటీ కో-చైర్

ఇతర ఐఐటీలు, సీఈపీటీ, ఎన్ఐటీ, ఇతర సంస్థల నుంచి పలువురు నిపుణులు కూడా కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు.

### నేడు మంత్రి నారాయణ రాక

ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ హాజరుకానున్నారు. డిసెంబరు 1, 2 తేదీల్లో 8వ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయనతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు పాల్గొంటారు.

## తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

ప్రమాదకర చెరువుల పరిశీలన



కుక్కంబాకం కొత్త చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... తుఫాన్ ప్రభావంతో మండలంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కార్యదర్శి తమ సచివాలయంలో రాత్రి బస చేయాలన్నారు. కాళంగి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తే తహనగర్, చిన్నయగుంట, పూసలపల్లి, జంబుగోళం ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జీఎన్ కండ్రిగ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. వెస్ట్‌వరత్తూరు కారణి మధ్య కాజ్‌వేను వరద నీరు పారే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం కుక్కంబాకంలో ప్రమాదకర స్థితిలో ఉన్న చెరువును పరిశీలించారు.

**కేవీబీపురం (ఆంధ్రజ్యోతి):** రాబోయే 24గంటల్లో దిత్వా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రోశయ్య చెప్పారు. పూరిళ్లలో ఉన్న వారు సమీపంలోని పాఠశాల, సచివాలయాల్లో తల దాచుకోవాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల వారిని సచివాలయ భవనాల్లోకి తరలిస్తున్నట్లు తెలిపారు.

**వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి):** తుఫాన్ ఇబ్బందులను మండలంలో అందరి సమన్వయంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ సుధీర్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్ఐ మల్లికార్జున్‌తో చర్చించారు. గోవర్ధనపురం బ్రిడ్జి, సీఎల్ఎన్ పల్లి, కడూరు కూడలి, పెద్ద పాండూరుల్లో ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో శివ, ఏవో ప్రసాద్, ఇన్‌చార్జి ఎంఈవో శశి, పశు వైద్యాధికారి గౌరి, ఏపీఎం సీతారాం, ఏపీవో గణేష్, సీహెచ్‌వో రాజు, ఏఈవో ప్రవీణ్, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా పాల్గొన్నారు.

**పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి):** తుఫాను పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మహ్మద్‌రఫి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ వెంకటేశ్వరులు కోరారు. 2వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలపడంతో రెవెన్యూ పంచాయతీరాజ్, విద్యుత్, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

## పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సత్యవేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా నాట్యమండలి కార్యకర్త పెంచలయ్యను హత్య చేయించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకుడు దాసరి జనార్దన్ కోరారు. హంతకుల వెనుక ఎంత పెద్ద నాయకుడు ఉన్నా సరే తక్షణం అరెస్టు చేసి చట్టం మీద ఉన్న గౌరవాన్ని ఇను మ డింపజేయాలన్నారు. పెంచలయ్య కుటుంబానికి తమ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

**రేణిగుంట (ఆంధ్రజ్యోతి):** ప్రజా నాట్య మండలి సభ్యుడు పెంచలయ్యను హత్య చేసిన ముఠాను అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐద్వా, సీఐటీయూ సభ్యులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలో మాదకద్రవ్యాల అనర్థాలపై యువతకు అవగాహన కల్పిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యుడు పెంచలయ్యను గంజాయి ముఠా సభ్యులు హత్య చేశారని, వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రాంతీయ కన్వీనర్ హరినాథ్, జన విజ్ఞాన వేదిక నాయకుడు వెంకటరమణ, సీఐటీయూ నాయకుడు సెల్వరాజ్, ఐద్వా నాయకురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## ప్రజా సేవకుడు సుదర్శన్ రెడ్డి

### ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): మండల మాజీ ఎంపీపీ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి ప్రజా సేవకుడని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఆదివారం సుదర్శన్ రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నారాయణవనం మండల అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఎంపీపీ దివాకర రెడ్డి, సుధాకర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, సర్పంచులు సాయి రవి, ఎలుమలై, నాగూర్, రమేష్, బాబు, ధర్మలింగం, సొరకాయలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇన్‌ఛార్జి మంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం తిరుపతికి రానున్నారు. ఉదయం 10.15 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11.40గంటలకు జీవకోనలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆటోనగర్‌లోని టీడీపీ తిరుపతి పార్లమెంటరీ కార్యాలయానికి చేరుకుని పార్టీ నేతలతో సమావేశమవుతారు. సాయంత్రం 6గంటలకు తిరుమలకు చేరుకుంటారు.

## అరణియార్ రిజర్వాయర్ పరిశీలన

పిచ్చాటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్‌ని స్థానిక పోలీసులతో కలసి తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బ రాయుడు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. జల వనరుల శాఖ డీఈ శ్రీనివాసులను ప్రాజెక్టు స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా అవసరమైతే స్థానిక పోలీసుల సాయం తీసుకోవాలని సూచించారు. 30.6 అడుగుల నీటిమట్టం ఉన్న సమయంలో రెండు గేట్లు ద్వారా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని డీఈ చెప్పారు., దీంతో ప్రస్తుతం నీటిమట్టం 29.8 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 32 అడుగులు కాగా 31 అడుగుల మేర నీటి నిల్వ స్థిరీకరిస్తామన్నారు. ప్రాజెక్టు వచ్చే నీటిని పరిశీలించాలని, రాత్రి పూట పోలీసుల సహకారం తీసుకోండని ఎస్పీ సూచించారు. డీఎస్పీ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరులు, పోలీసులు పాల్గొన్నారు.

## వెదళ్లచెరువుకు బొగడ

● ఇసుక బస్తాలతో మూసివేత

● తప్పిన ప్రమాదం



బొగడను ఇసుక బస్తాలతో మూసివేస్తున్న అధికారులు

రేణిగుంట నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదళ్లచెరువు చెరువుకు బొగడ పడింది. సకాలంలో రైతులు గుర్తించడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులతో కలిసి అధికారులు ఇసుక మూటలు వేసి బొగడను పూడ్చివేశారు. అలాగే తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి మండలంలోని వాగులు, వంకలను పరిశీలించారు. పూడిపోయిన మర్రిగుంట చెరువు కలుజును ఎక్స్‌వేటర్ సాయంతో శుభ్రం చేయించి నీటిని దిగువకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

## తెనాలి బాలుయాదవ్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



భారతమ్మకు నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తెనాలి బాలుయాదవ్ తల్లి తెనాలి భారతమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం వారి స్వగృహంలో కర్మక్రియలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ముక్కంటి పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అక్కడికి చేరుకుని భారతమ్మకు నివాళులర్పించారు. బాలుయాదవ్‌కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిరాజ్‌బాషా, ఉత్తరాజి శరవణకుమార్, కంఠ ఉదయ్‌కుమార్, గోరా, పఠాన్ ఫరీద్, బుల్లెట్ జయశ్యామ్‌రాయల్, తీగల చిన్న శ్రీవారి సురేష్, మునికృష్ణారెడ్డి, అరవింద్‌రెడ్డి, శంకర్ ముద్దుమూడి, రవి, పెరుమాళ్ చౌదరి, జుంలేషా, మహేష్, గాలి రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పూడి గ్రామాల మట్టి వంతెన...

## ప్రస్తుతానికి ప్రమాదం లేదు!

కేవీబీపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం వలన పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన ప్రమాదానికి గురవుతుందనే ఉద్దేశంతో రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఒక వేళ భారీ వర్షాలు పడితే వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అందుకోసం ముందుజాగ్రత్త చర్యగా సిబ్బందిని కాపాల ఉంచినట్టు ఎంపీడీవో మాలతి చెప్పారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



కరపత్రాల పంపిణీలో టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని టీడీపీ నాయకుడు గంధమనేని రాజేష్ అన్నారు. ఆదివారం మండలంలోని రామాపురం, వెంగళత్తూరు, శివగిరి, రామగిరి పంచాయతీల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శివకృష్ణమనాయుడు, రమేష్ నాయుడు, వెంకటేశ్వరులు, విజయకుమార్ నాయుడు, మహేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ డైరెక్టర్‌గా భాగ్యలక్ష్మి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న భాగ్యలక్ష్మి దంపతులు

ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఏర్పేడు మండలం మేర్లపాకకు చెందిన కేకే భాగ్యలక్ష్మిని మహిళా కోటా కింద ఎమ్మెల్యే సుధీర్ ఎంపిక చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమెను డైరెక్టర్‌గా అధికారికంగా నియమించింది. ఆమె భర్త కేకే రమణ టీడీపీలో కీలకంగా ఉన్నారు. ఈ సందర్భంగా కేకే రమణ, ఆయన సతీమణి భాగ్యలక్ష్మి ఎమ్మెల్యే సుధీర్‌ని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు.

## బ్యూటీషియన్ కోర్స్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో డీఆర్‌డీఏ పీడీ తదితరులు

రేణిగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బ్యూటీషియన్ కోర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు ప్రారంభించారు. ఆదివారం పట్టణంలో సిరి బ్యూటీషియన్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... శిక్షణ అనంతరం మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శిరీష, సెట్విన్ పూర్వ సీఈవో మురళీకృష్ణ, స్టార్టప్ చైర్మన్ రామిరెడ్డి, డీఆర్పీ ప్రసాద్, పలువురు మహిళా సంఘాల సభ్యులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

## సివిల్ రైట్స్ డే

ఏర్పేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులపాళెం గిరిజనకాలనీలో అధికారుల బృందం ఆదివారం సివిల్ రైట్స్ డే నిర్వహించింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. అంటరానితనం, అసమానతలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.